
సాక్షి మెదక్

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



వన్యప్రాణుల మృత్యుఘోష
ఆకలి, దప్పిక తీర్చుకునేందుకు బయటి కొస్తున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వేటగాళ్లు ప్రాణాలను హరించి వేస్తున్నారు.
వివరాలు ||లో ▸



టార్పాలిన్లకు భలే డిమాండ్
రైతులు ధాన్యం ఆరబెట్టడానికి, వర్షం నుంచి కాపాడుకోవడానికి టార్పాలిన్లు చాలా అవసరం . వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టార్పాలిన్లకు మంచి డిమాండ్ పెరిగింది. వివరాలు ||లో ▸



సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్..
ఇందిరా గాంధీ స్టేడియంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ అట్టహాసంగా ప్రారంభమైంది.
వివరాలు |||లో ▸

న్యూస్‌రీల్

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి



సభకు జరుగుతున్న ఏర్పాట్లు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సురేశ్‌షెట్కార్‌కు మద్దతుగా నిర్వహించే ఈ సభకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేపట్టారు. స్థానిక మోడల్‌స్కూల్ వద్ద హెలీపాడ్‌తో పాటు సభాస్థలి వద్ద పనులు పూర్తిచేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సొంత గూటికి మ్యాడం బాలకృష్ణ

జగ్గారెడ్డి సమక్షంలో చేరిక



జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బాలకృష్ణ

మెదక్‌జోన్: మెదక్ నియోజకవర్గ సీనియర్ నేత మ్యాడం బాలకృష్ణ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. గురువారం గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సీనియర్ నేత కోదండరెడ్డి సమక్షంలో ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గ పరిధిలో బలోపేతం చేయడంలో బాలకృష్ణ కీలక పాత్ర పోషించారు. కాని అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కక పోవడంతో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. తిరిగి ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు.

జేఈఈలో గిరిజన విద్యార్థి ప్రతిభ



ప్రవీణ్‌కుమార్

నర్సాపూర్: జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి ప్రతిభ కనబర్చినాడని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. తమ కాలేజీకి చెందిన 33మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రాయగా వారిలో 17మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని, ప్రవీణ్‌కుమార్ 94.09శాతం మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో 847వ ర్యాంకు సాధించాడని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ భిక్షమయ్య, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, లెక్చరర్లు వెంకటయ్య, సుదేంద్ర అభినందించారు.

మాథ్ బీలో నర్సాపూర్ విద్యార్థి



విద్యార్థి నిశాంత్ తివారి

నర్సాపూర్: సాక్షి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మాథ్ బీ ఫైనల్ రౌండ్‌లో నర్సాపూర్ విద్యార్థి స్థానం పొందాడు. శ్రీవిష్ణు ఉన్నత పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి నిశాంత్ తివారి ఈ టాలెంట్ టెస్టులో పాల్గొని ఫైనల్ రౌండ్ వరకు వెళ్లాడు. అతడికి నిర్వాహకులు మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జామి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

ఎంపీ బీబీపాటిల్ కారు ఢీకొని.. వ్యక్తికి గాయాలు



గాయపడిన యాదగిరి

చిన్నశంకరంపేట(మెదక్): జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. సంకాపూర్ గ్రామానికి చెందిన బోయిని యాదగిరి బైక్‌పై రామాయంపేట నుంచి వస్తూ సంకాపూర్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా ఎంపీ వాహనం ఢీకొంది. దీంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ జాదవ్‌రాజేశ్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొహినొద్దీన్ తెలిపారు.

మెదక్ గడ్డ.. గులాబీ అడ్డా

- 25ఏళ్లుగా జెండా ఎగురుతోంది
- అభివృద్ధిపై మాట్లాడే హక్కు రేవంత్‌కు లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మెదక్‌మున్సిపాలిటీ: రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్‌మున్సిపాలిటీ: ''మెదక్ జిల్లా.. గులాబీ అడ్డా.. పాతికేళ్ల నుంచి ఈ గడ్డపై గులాబీ జెండా ఎగురుతోంది''అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని వెల్‌కమ్ బోర్డు నుంచి పట్టణం నడిబొడ్డు వరకు వేలాదిమందితో గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రాందాస్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ పదేళ్లుగా మెదక్ ఏమి అభివృద్ధి చెందిందని సీఎం రేవంత్‌రెడ్డి అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు సీఎంకు లేదని చెప్పారు. ప్రత్యేక జిల్లాలను ఏర్పాటుచేసి, మెడికల్ కాలేజీలు, కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు తెచ్చింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రాల్లో నాలుగు లేన్‌ల రహదారులు ఎవరు వేయించారో చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేక ఒట్లు పెట్టి మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాటలు నమ్మడమంటే నీళ్లులేని బావిలో దూకడమేనన్నారు. అందుకే దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంకోసం 14ఏళ్లపాటు అలుపెరగని పోరాటం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎకరం పంట ఎండిపోకుండా నీరందించారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 25లక్షల ఎకరాల్లో పంటలను ఎండబెట్టిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏళ్లుగా అదనపు కలెక్టర్, కలెక్టర్‌గా విధులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. తనను గెలిపిస్తే అన్ని మండల కేంద్రాల్లో స్టడీ సెంటర్లు ఏర్పాటుచేసి విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తానని, రూ.100కోట్లు సొంత నిధులతో ట్రస్టు ఏర్పాటుచేసి పేదలను అన్నిరకాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల్లో జోష్..

మెదక్‌జోన్: బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన సభలో హరీశ్‌రావు కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు. 12.30కు ఆయన ప్రసంగం ప్రారంభించారు. ఎండను లెక్కచేయకుండా వేలాది మంది కార్యకర్తలు, ప్రజల సభకు తరలివచ్చారు.

ఒకరు బ్లాక్‌మెయిలర్.. ఒకరు 6వ తరగతి..

మెదక్ పార్లమెంట్ బరిలో ఉన్న వ్యక్తుల్లో ఒకరు బ్లాక్‌మెయిలర్, మరొకరు 6వ తరగతి చదివిన వారని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధులనుద్దేశించి హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఉన్నత చదువు చదివారని రేపు పార్లమెంట్‌లో ఏ భాషలోనైనా ధారాళంగా మాట్లాడే సత్తాగల వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక, సంగారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘన స్వాగతం..

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్‌రాంరెడ్డి నామినేషన్ కోసం నర్సాపూర్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావ్, ఎమ్మెల్యే సునీతారెడ్డి వెళ్లడంతో కౌడిపల్లిలో మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. వారి వెంట కలిసి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, జెడ్పీటీసీ కవిత అమర్ సింగ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, దూద్యనాయక్, నర్సింహులు, సత్తయ్య తదితరులు తరలివెళ్లారు.

కారు తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న సిబ్బంది

నర్సాపూర్: జాతీయ రహదారిపై నర్సాపూర్ పట్టణ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు కారును సిబ్బంది తనిఖీ చేశారు. ఆయన హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్లేందుకు రావడంతో ఆయన కారును చెక్‌పోస్ట్ సిబ్బంది ఆపి తనిఖీ చేశారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు తీసుకొస్తా

పేదల సేవ కోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

- రూ. 100 కోట్లతో విద్యానిధి ఏర్పాటు
- ప్రతినియోజకవర్గానికి ఫంక్షన్ హాలు.. రూపాయికే అద్దె
- ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకున్నాం
- ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- 'సాక్షి'తో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



SAKSHI INTERVIEW

'పేదల సేవ కోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాను. అందరి సహకారంతో ముందుకు వెళ్తున్నా. అధిక మెజారిటీ సాధించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకున్నాం. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు విద్యానిధిని ఏర్పాటు చేస్తున్నా. అందరూ నిండు మనస్సుతో ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని కోరుతున్నా' అని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార వేళ 'సాక్షి' పలకరించింది. వివరాలు ఆయన మాటల్లోనే..

–సాక్షి, సిద్దిపేట

కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలు, సభలు, సమావేశాలతో ప్రచారంలో ముందుకు సాగుతున్నాం. మెదక్ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ బలంగా ఉంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు, కార్యకర్తలు, నాయకుల సహకారం సంపూర్ణంగా ఉంది. గతంలో జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా పని చేయడంతో అందరికీ తెలిసిన వ్యక్తిని.

☛ స్వార్థం కోసమే వెళ్తున్నారు..

బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట ఉమ్మడి మెదక్ జిల్లా. పార్టీలో మొదటి నుంచి కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం వచ్చిన వారు మాత్రమే ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారు. మధ్యలో వచ్చిన వారు మధ్యలోనే వెళ్తుండటంతో మొదటి నుంచి ఉన్న కార్యకర్తలు సంతోషంగా ఉన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వస్తామంటే అస్సలు తీసుకోవద్దని కార్యకర్తలు కోరుతున్నారు.

☛ అసత్య ప్రచారం

దేశంలో ఎక్కడా లేని విధంగా ముంపు బాధితులకు పరిహారం అందించి ఆదుకున్నాం. వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల్లో భూములు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూంలు ఇచ్చాం. గతంలో ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకోవాలని చూశారో వారే అసత్య ప్రచారం చేస్తున్నారు. ఒక్కరిద్దరికి పరిహారం అందకపోతే నేను ఎంపీ సభ్యుడిగా గెలుపొందిన తర్వాత న్యాయం చేసేందుకు కృషి చేస్తా. ముంపు బాధితులందరూ బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారు.

☛ రెండున్నరేళ్లుగా..

రెండున్నరేళ్ల నుంచి పరోక్ష రాజకీయాల్లో ఉన్నాను. ప్రస్తుతం ప్రత్యక్ష ఎన్నికల్లోకి వచ్చాను. నా ఓటర్లకు సాయం చేయాల్సిన బాధ్యత ఉంది. విద్యావంతునిగా.. పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విద్యానిధిని ఏర్పాటు చేస్తున్నాను. నా ఉమ్మడి కుటుంబం ఆస్తుల నుంచి, నా మిత్రుల సహకారంతో రూ.100 కోట్లతో విద్యా నిధిని గెలిచిన కొద్ది రోజుల్లోనే ఏర్పాటు చేస్తాను. అలాగే ప్రతీ నియోజకవర్గంలో పెద్ద ఫంక్షన్ హాల్స్ 9 నెలల్లోనే నిర్మిస్తాను. వాటిని ప్రజలకు ఒక్క రూపాయి అద్దెతో ఇస్తాను.

☛ అధికారిగా సంతృప్తినిచ్చింది

22 ఏళ్ల అధికారిగా ప్రజల కోసం చేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. బాధ్యతగా విధులు నిర్వర్తించాను. అన్ని ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రతీ సీఎం అప్పగించిన బాధ్యతలను పూర్తి చేశాను. గతంలో అధికారి హోదాలో నామినేషన్లను స్వీకరించాను. ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడు, సేవకుడిగా నామినేషన్ వేయడం సంతోషంగా ఉంది. అలాగే ఎంపీగా గెలిస్తే ఈ ప్రాంతానికి వ్యవసాయ ఆధారిత, ఇతర పరిశ్రమలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను.

☛ విశ్వసనీయతకు ఓటు వేయండి

నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటాను. కుటుంబ సభ్యునిగా ఆదుకుంటా. ప్రజలు నన్ను నిండు మనస్సుతో ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని కోరుతున్నా. విశ్వసనీయతకు ఓటు వేయండి, హుందా రాజకీయలకు స్వాగతం పలకండి. మోసగింపు రాజకీయాలకు, తప్పుడు ప్రచారం చేసేవారికి ఓటు వేయవద్దు.

అబద్ధపు హామీలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మంత్రి దామోదర

మంత్రి దామోదర

రేగోడ్(మెదక్)/టేక్మాల్(మెదక్): అబద్ధపు హామీలకు బీఆర్‌ఎస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోపించారు. రేగోడ్, టేక్మాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాలకు గురువారం ఆయన హాజరయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దని సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తామని స్పష్టం చేశారు. వచ్చే వేసవి నాటికి బోరంచ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని చెప్పారు. కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టానని పేర్కొన్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, జెడ్పీటీసీ యాదగిరి, కో ఆప్షన్ సభ్యుడు చోటు మియా, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌పాటిల్ పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే సైనికులని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అల్లాదుర్గంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ అధికారం చేపడితేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలమన్నారు. శేషారెడ్డి, బలరాం, మహేశ్, సదానందం, నర్సింహారెడ్డి, సుభాస్‌రావు, ప్రేమ్‌కుమార్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

90 నామినేషన్లు.. 54మంది అభ్యర్థులు

- ముగిసిన ప్రధాన ఘట్టం
- చివరిరోజు 36 దాఖలు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గడువు గురువారం మూడు గంటలకు ముగిసింది. చివరి రోజు 23మంది అభ్యర్థులు 36నామినేషన్లు అందజేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఈనెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి గురువారం వరకు మొత్తం 54మంది అభ్యర్థులు 90నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పాటు మొత్తం 16 పార్టీల నుంచి 16మంది అభ్యర్థులతోపాటు మరో 38 మంది స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు. వాటిని శుక్రవారం అధికారులు పరిశీలించి అన్ని పత్రాలు సరిగా ఉన్న వారిని అభ్యర్థులుగా ప్రకటించనున్నారు. 29వరకు నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం కల్పిస్తారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



నర్సాపూర్: పోలీస్ శాఖ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్‌తో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి నర్సాపూర్‌లోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన కౌంటింగ్ కేంద్రాలు, గిరిజన గురుకుల కాలేజీలో మరో రెండు సెగ్మెంట్ల కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్నికల అధికారులకు వివరించారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే పలు చెక్‌పోస్టులను తనిఖీ చేసి మద్యం, నగదు అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, ఫర్హీన్ షేక్, ఆర్‌ఐ ఫైజల్ ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ మధులత



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధులత

నర్సాపూర్ రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ జ్యోతి, ఎంపీడీఓ మధులత అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతోందని, ఏ ఒక్కరు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులు, గ్రామ కార్యదర్శులకు సూచించారు. మిషన్ భగీరథ డీఈ కిషన్ మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి పైప్‌లైన్, సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అందజేస్తున్న ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సరిపోవడం లేదని అదనంగా మరిన్ని కావాలని ఆరోగ్యశాఖ అధికారులను ఎంపీడీఓ మధులత కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో 45రోజుల్లో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీఆర్ ఏఈ స్వామిదాస్ తెలిపారు. ఇప్పటికే కమిటీలు వేశామని చెప్పారు. ఆయాశాఖల అధికారులు తాము చేపట్టిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

సంతకాలు పెట్టి వెళ్లిపోయిన ఎంపీటీసీలు

మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని తమ ఎంపీటీసీల పరిధిలో ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాల్సిన ఎంపీటీసీలు సంతకాలు పెట్టి వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆయా శాఖల అధికారులతో సమావేశం జరిపించి ముగించారు.

కమల దళంలో నయా జోష్

- అమిత్ షా సభ సక్సెస్‌తో కార్యకర్తల్లో ఉత్సాహం
- కాషాయమయమైన సిద్దిపేట పట్టణం
- భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు



సంఘీభావం తెలుపుతున్న కేంద్ర మంత్రి అమిత్‌షా, ఎంపీ అభ్యర్థి రఘునందన్, ఈటల తదితరులు

సాక్షి, సిద్దిపేట: కమల దళం కదం తొక్కింది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ సక్సెస్ కావడంతో కమలదళంలో ఉత్సాహం నింపింది. సిద్దిపేటలో గురువారం నిర్వహించిన పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు గెలుపు కోసం నిర్వహించిన బీజేపీ విశాల జనసభ విజయవంతం కావడంతో కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సభకు భారీగా జనం తరలిరావడంతో ప్రాంగణమంతా కాషాయమమైంది. వేదికపైకి అమిత్ షా రాగానే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు శాలువాతో సత్కరించారు. సభికులకు అభివాదం చేస్తూ వేదికపై అమిత్ షా కలియతిరిగారు. సభ ప్రారంభానికి ముందే అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సభ వేదికపైకి ఆయన రాగానే కార్యకర్తలు కేరింతలు కొట్టారు. మోదీ.. మోదీ, జై శ్రీరామ్ అనే నినాదాలతో హోరెత్తింది. ఎండ వేడికి సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు కొంత ఇబ్బంది పడ్డప్పటికీ సభ ముగిసే వరకు ఉన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ రఘునందన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రత్యేక హెలీకాప్టర్‌లో..

బేగంపేట నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో సిద్దిపేటకు చేరుకున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న చేసిన హెలీప్యాడ్‌లో దిగారు. షెడ్యూల్ ప్రకారం 11:55గంటలకు రావల్సి ఉండగా మధ్యాహ్నం 1:55 గంటలకు అమిత్‌షా సభ ప్రాంగణానికి వచ్చారు. మళ్లీ 2:07గంటలకు బయలు దేరి వెళ్లారు. 8 నిమిషాలు మాత్రమే ప్రసంగం చేశారు. భువనేశ్వర్‌కు సాయంత్రం 4గంటలకు వెళ్లాల్సి ఉండడంతో త్వరగా తిరుగు ప్రయాణం అయ్యారు.

నర్సాపూర్: సిద్దిపేటలో జరిగిన బీజేపీ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ బుచ్చేశ్ యాదవ్ కలిశారు. ఆయన వెంట మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఉన్నారు.



ఆరోగ్యానికి వాకింగ్

ఆర్యోగానికి టానిక్ వాకింగ్. రోజూ నడిస్తే హెల్దీగా ఉండొచ్చు. ఇలా చేస్తే శరీరంలో క్యాలరీలు తగ్గి వెయిట్‌లాస్ అవుతారు. కచ్చితంగా ఇన్ని మైళ్లు టార్గెట్ పెట్టుకొని నడిస్తే ఆరోగ్యం, ఆహ్లాదం చేరువవుతాయి. దీంతో బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవు. పైసా ఖర్చు లేకుండా ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఎముకలు బలంగా తయారవుతాయి.. కండరాలు సైతం ధృడంగా తయారవుతాయి ఆయుర్దాం కూడా పెరుగుతుంది. అంతేకాదు వాకర్ల కోసం అసోసియేషన్‌లు పెట్టుకొని మరీ నడుస్తున్నారంటే ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు కూడా తమ వద్దే రోగులకు వ్యాయామం చేయాలని సూచనలు సలహాలు ఇస్తున్నారు.

రోజూ పది వేల అడుగులు నడిస్తే చాలు

- ఉదయమైతే మంచిది
- బరువు తగ్గేందుకు తెల్లవారుజాము సూర్యకిరణాలు దోహదం
- అసోసియేషన్లు సైతం ఏర్పాటు
- 5 వేల అడుగుల కంటే తక్కువగా నడిస్తే బద్ధకస్తులట

మెదక్ కలెక్టరేట్: వ్యాయామల్లో నడకకు మించిన తేలికపాటి వ్యాయామం మరొకటి లేదు. దీనికి వయసుతో పని లేదు. వయోభేదం అసలే లేదు. ఏ వయస్సు వారైనా ఎప్పుడైనా, ఎక్కడైనా కొనసాగించొచ్చు. ఇందుకు రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. బరువు తగ్గుతారు ఆపై ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇటీవల వాకర్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆయా చోట్ల వాకర్స్ అసోసియేషన్స్ కూడా ఏర్పాటయ్యాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం, వెస్లి ఉన్నత పాఠశాల మైదానంతోపాటు మెదక్-నర్సాపూర్-చేగుంట ప్రధాన రహదారుల్లో నిత్యం తెల్లవారుజాము వాకర్స్‌తో కిటకిటలాడుతున్నాయి.

ఎంత బరువు తగ్గుతారు

ఒక మైలు దూరాన్ని 13 నిమిషాలు లేదా అంత కన్నా తక్కువ సమయంలో నడిస్తే వంద క్యాలరీలు ఖర్చవుతాయి. ఈ లెక్కన ఎంత బరువు తగ్గాలనుకుంటున్నారో? అన్ని మైళ్లు మనం నిర్ణయించుకోవాలి. రోజూ క్రమం తప్పకుండా నడిచినట్లయితే పొందు బరువు తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఉదయాన్నే నడిస్తే మేలు

బరువు తగ్గాలనుకునే వారు తప్పనిసరిగా ఉదయాన్నే నడవాలి. సూర్య కిరణాలు శరీరానికి విటమిన్-డి అందేలా చూస్తాయి. ఈ విటమిన్ కూడా బరువు తగ్గించేందుకు దోహద పడుతుంది. ఉదయాన్నే నిద్రలేస్తే జీవక్రియల రేటు సక్రమంగా ఉంటుంది. ఉదయం పూట జాగింగ్ చేస్తే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీనికితోడు ఉదయాన్నే నీళ్లు ఎక్కువగా తాగితే కొవ్వు, క్యాలరీలు అధికంగా కరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

నడకతో ఆయుష్షు పెరుగుదల



సరైన పద్ధతిలో రోజూ నడిస్తే అనారోగ్యాలు దూరమవుతాయి. అంతేకాకుండా ఆయుష్షు పెరుగుతుంది. ఉదయం 8 గంటల లోపు వాకింగ్ పూర్తి చేయాలి. సాయంత్రం 7 గంటల తరువాత వాకింగ్ చేయాలి. ఇది ఒత్తిడి లేని వ్యాయామం. ప్రతి ఒక్కరూ రోజుకు 7,500 నుంచి 10 వేల అడుగులు తప్పనిసరిగా నడవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటుంది. 5 వేల అడుగుల కంటే తక్కువగా నడిచే వాళ్లను బద్ధకస్తులు అంటారు. అయితే వాకింగ్ చేస్తే కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది. బీపీని కంట్రోల్‌లో ఉంచుతుంది. కొన్ని క్యాన్సర్లు రాకుండా నిరోధిస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్తులకు మంచి ఔషధం. మానసికస్థితిని పెంచుతుంది. ఎముకలను గట్టిగా ధృడంగా చేస్తుంది. గుండెపోటు సమస్యను చాలా వరకు తగ్గిస్తుంది. శరీర కండరాలను సమతుల్యం చేస్తుంది. ఉదయాన్నే నిర్ణీత సమయానికి వాకింగ్ చేస్తే క్రమశిక్షణ అలవడుతుంది. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి, వాళ్లు చదువుకున్నది బాగు గుర్తుంటుంది.

– దువ్వల్లవంశీ, ఆర్థోపెడిక్ వైద్యులు, మెదక్

ఆరోగ్యానికి తప్పనిసరి



నేను 30 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. మంచి ఆరోగ్యంతో ఉన్నా. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే వాకింగ్ చేయాలి. ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాధుల నుండి దూరంగా ఉండాలంటే వాకింగ్ తప్పనిసరి.

– గడ్డంకాశీనాథ్, మెదక్

అదుపులో బీపీ, షుగర్



నేను ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తా. నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నా. దీంతో ఎలాంటి మందులు వాడకపోయిన బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉన్నాయి. వాకింగ్‌తో ఒక రకమైన ఎనర్జీ వస్తుంది. రోజూ తప్పనిసరిగా గంట పాటు నడుస్తా.

– హన్మంతు, మెదక్

ఇదే నా మొదటి దినచర్య



రోజూ ఉదయం లేవగానే మైదానంలోకి రావాల్సిందే. గంట పాటు వాకింగ్ చేయాల్సిందే. ఇదే నా మొదటి దినచర్య. పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నా. వాకింగ్‌తోపాటు ప్రతి ఒక్కరూ చిన్న చిన్న ఎక్సర్‌సైజులు కూడా చేయాలి. దీని వల్ల వాకింగ్ చేసినందుకు మంచి ఫలితం ఉంటుంది.

– మురళి, మెదక్

18 ఏళ్లుగా వాకింగ్



నేను జ్యువెలరీ వర్క్ చేస్తుంటా. దీంతో గంటల తరబడి షాపులో కూర్చోవాల్సి ఉంటుంది. అందువల్ల రోజూ తప్పనిసరిగా ఉదయాన్నే వాకింగ్ దినచర్యగా పెట్టుకున్నా. 18 సంవత్సరాలుగా రోజూ వాకింగ్ చేస్తుంటా. శారీరక, మానసిక ఇబ్బందులు తగ్గి ఎంతో ఉల్లాసంగా ఉంటుంది.

– వెంకటాచారి, మెదక్

యువకుడి సజీవ దహనం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఆపై మంటలు అంటుకొని దగ్ధం
- ఓఆర్ఆర్‌పై ఘటన



రైలింగ్ లారీ మధ్య ఇరుక్కుపోయిన కారు



శిరీష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో యువకుడు సజీవ దహనమయ్యారు. సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి పాశమైలారం పారిశ్రామికవాడలోని ఒక పరిశ్రమకు బొగ్గు లోడును తీసుకెళ్తున్న లారీ.. పటాన్‌చెరు శివారు ఓఆర్ఆర్‌పై ముత్తంగి రింగ్ రోడ్డు ఎగ్జిట్-3కి సమీపాన ఆగింది. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు దాన్ని ఢీకొని.. లారీకి ఔటర్ రైలింగ్‌కు మధ్య ఇరుక్కుంది. దీంతో ఒక్కసారిగా వచ్చిన మంటల్లో కారు చిక్కుకుంది. అందులో ఉన్న వ్యక్తి మాత్రం సజీవ దహనమయ్యాడు. లారీ టైర్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. బొగ్గు కారుపై పడటంతో ఎంతమంది ప్రయాణిస్తున్నారనేది తెలియ రాలేదు. చివరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి జేసీబీల సహాయంతో లారీని ముందుకు జరిపి దగ్ధమైన కారును బయటకు తీస్తే బీరంగూడకు చెందిన శిరీష్(33)గా గుర్తించారు. అతను హైదరాబాద్ లో తన స్నేహితుడి ఫంక్షన్ ఉందని ఇంట్లో చెప్పి బుధవారం సాయంత్రం కారు తీసుకొని ఇంటి నుంచి బయలుదేరాడు. గురువారం ఉదయం తెల్లవారుజామున సుల్తాన్‌పూర్ నుంచి ముత్తంగి వైపు వస్తుండగా ప్రమాదం జరిగిందని మృతుడి సోదరుడు కార్తీక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాక్టివాలు ఢీకొని వ్యక్తి మృతి



మంగళి రమేష్ మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): యాక్టివాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకుట్లపల్లి గ్రామానికి చెందిన చెందిన మంగళి రమేష్(32) గ్రామంలో నుండి తన యాక్టివాపై కౌడిపల్లి వైపు వస్తున్నారు. కౌడిపల్లికి చెందిన మల్లేశం తన పిల్లలతో కలిసి మరో యాక్టివాపై జోగిపేట వైపు వెళ్తున్నాడు. కాగా రెండు వాహనాలు కూకుట్లపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొనగా.. మంగళి రమేష్‌కు తీవ్రగాయాలు కాగా మల్లేశం అతని పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు రమేష్‌ను చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతుడు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బైక్‌లు ఢీకొన్ని వ్యక్తికి తీవ్రగాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడి కాలు విరిగింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం రామవరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందారం స్టేజీ సేవాలాల్ తండాకు చెందిన వృద్ధుడు ముడావత్ స్వామి బైక్‌పై రామవరం మీదుగా కొండపూర్‌కు వెళ్తున్నాడు. మరో బైక్ కొండపూర్ నుంచి రామవరానికి వస్తుంది. ఈ క్రమంలో రామవరం వద్ద రెండు వాహనాలు కూడా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్వామికి కాలు విరిగింది. అనంతరం 108లో హుస్నాబాద్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బైక్, డీసీఎం ఢీకొని ఒకరు..

పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గద్దగుండుతండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో సంగారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందారు. ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం భూత్కూర్ గ్రామానికి చెందిన బేగరి సుభాష్ (25) బైక్‌పై పిట్లం నుంచి బుధవారం రాత్రి 11 గంటలకు సంగారెడ్డి వైపు వెళ్తున్నాడు. గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం ఢీకొట్టగా సుభాష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

హత్య కేసులో 12 మందికి రిమాండ్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ సింగార్ బోగుడా తండాలో ఇటీవల జరిగిన రాథోడ్ శ్రీనునాయక్ హత్య కేసులో 12 మంది నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. తండాకు చెందిన రాజ్యనాయక్, హరి, సురేష్‌తో పాటు 12 మందిని.. కంగ్టీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి నారాయణఖేడ్ కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానం వారికి 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు.

అడవిపంది దాడిలో ఈజీఎస్ కూలీకి గాయాలు

కొండపాక(గజ్వేల్): ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీపై అడవి పంది దాడి చేసింది. ఈ సంఘటన కొండపాక మండలం బందారంలో గురువారం జరిగింది. స్థానికుల తెలిసిన కథనం ప్రకారం.. ఈజీఎస్ పథకంలో భాగంగా గ్రామ శివారులో సుమారు 200 మంది కూలీలు వేర్వురు చోట్ల పనులు చేస్తున్నారు. ఎండ బాగా ఉండటంతో తోటి కూలీలు పనులు చేస్తుండగా, కూలీ మంజుల 10 గజాల దూరంలో చెట్టు కింద నిలబడింది. చెట్ల పొదల నుంచి హఠాత్తుగా అడవి పంది బయటకు వచ్చి దాడి చేసింది. దీంతో క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెన్నార్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు చైర్మన్ రాజ్ అన్నారు. సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామశివారులో గల ఎమ్మెన్నార్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదవాలని ఆకాంక్షించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

గజ్వేల్‌రూరల్: నిర్మానుష్యం ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయి వెంచర్ సమీపంలో గురువారం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయి వెంచర్ సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో సుమారు 35-40ఏళ్ల మధ్య వయసున్న ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సైదా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెంది కూడా నాలుగు రోజులై ఉండొచ్చని, పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేనంతగా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. మృతురాలి ఒంటిపై బ్లూ కలర్ ఫుల్ షర్ట్, ఎరుపు రంగు లంగా ధరించి ఉంది. వారం రోజుల క్రితం ఈ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరించినట్లు పోలీసులకు స్థానికులు తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ.. స్వచ్ఛంద సంస్థ చెంతకు

గజ్వేల్‌రూరల్: మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ స్వచ్ఛంత సంస్థ చెంతకు చేర్చారు ఓ ఉపాధ్యాయురాలు. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ (పల్లెపహాడ్)కు చెందిన రాజుకు భోదన్‌కు చెందిన మీనాక్షితో వివాహమైంది. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయిన ఆమె రోడ్లపై సంచరిస్తుంది. గురువారం కూడా తిరుగుతుందని సమాచారం అందుకున్న ఉపాధ్యాయురాలు సౌజన్య ముట్రాజ్‌పల్లి మార్గంలో ఉండటాన్ని గుర్తించారు. ఆటోలో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం సఖి స్వచ్ఛంద సంస్థ సభ్యులకు అప్పగించి మానవత్వాన్ని చాటుకున్నారు.



మీనాక్షిని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న సౌజన్య

బీబీ పాటిల్ కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



బైక్‌ను ఢీకొట్టిన పాటిల్ కారు ఇదే

చిన్నశంకరంపేట(మెదక్): ఒక పార్టీ ఎంపీ అభ్యర్థి వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తి శివనూర్ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంకాపూర్ గ్రామానికి చెందిన బోయిని యాదగిరి బైక్‌పై రామాయంపేట నుంచి సొంతూరుకు బయలుదేరాడు. సంకాపూర్ వద్ద రోడ్డును దాటుతుండగా బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీ పాటిల్ ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో యాదగిరి కాలు, చేయికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే 108లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఎంపీ బీబీ పాటిల్ డ్రైవర్ జాదవ్ రాజేష్ నిర్లక్ష్యంగా కారు నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఎంపీ బీబీ పాటిల్ మరో వాహనంలో కామారెడ్డికి వెళ్లారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి.. విద్యాదాఘాతంతో రైతు..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి



నర్సింహులు (ఫైల్)

సిద్దిపేటరూరల్: చేపల వేటకు వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతమడకలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ అపూర్వరెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోత్కు నర్సింహులు గురువారం ఉదయం 11 గంటల సమయంలో చేపల వేట కోసం ముదిరాజ్ కులస్తులతో కలిసి పెద్ద చెరువులో దిగాడు. లోపలకు దిగిన వెంటనే జారిపోయి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. కాగా గజ ఈతగాళ్లతో గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుదాఘాతంలో ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగులపల్లిలో గురువారం జరిగింది. సీఐ మహేష్ గౌడ్ తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రైతు మగ్దంపల్లి అశోక్ (44) గురువారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పొలానికి నీరు పెడదామని చూస్తే బోరు మోటారు పనిచేయడం లేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా షాక్ తగిలి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు క్షతగాత్రుడిని హుటాహుటిన సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లీసులు తెలిపారు.

మే 27న ఎమ్మెల్సీ ఎన్నిక

- పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 2న నోటిఫికేషన్ జారీ
- అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- మూడు జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక మే 27వ తేదీన జరగనున్నాయి. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి డిసెంబర్ 9న రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తే ఆరు నెలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఎన్నికల సంఘం మార్చి వరకు ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైంది. తాజాగా ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది.

ఆరోజు నుంచే నామినేషన్లు

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మే 2న నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. అదే రోజు నుంచి మే 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ జరగనుంది. ఆ తరువాత 10వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. మే 27వ తేదీన ఎన్నికకు పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపడతారు.

మూడు ఉమ్మడి జిల్లాల ఓటర్లు ఇలా..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 12 కొత్త జిల్లాల పరిధిలో మొత్తం 4,61,806 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. జనవరి నెల నుంచే ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం కొత్తగా ఓటర్ల జాబితాను తయారు చేసింది.

వన్యప్రాణుల మృత్యు ఘోష

వన్యప్రాణుల పాలిట మృత్యుఘంటికలు మోగుతున్నాయి. ఆకలి, దప్పిక తీర్చుకునేందుకు బయటికొస్తున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. అడుగుజాడల మాటున వేటగాళ్లు ప్రాణాలను హరించి వేస్తున్నారు. అలాగే అదుపు తప్పి వనం నుంచి జనారణ్యంలోకి వస్తూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు విడుస్తున్నాయి. హుస్నాబాద్ అటవీ ప్రాంతం పలు జిల్లాల సరిహద్దులతో ముడిపడి ఉంది. వన్యప్రాణులకు ఆవాసంగా ఉండగా వేసవిలో మూగ జీవాల వేదన అరణ్య రోదనగా మిగిలింది.

ఆహారం కోసమొస్తే.. ప్రాణాలు హరి


- అటవీ ప్రాంతం నుంచి జనావాసంలోకి
- వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న జంతువులు

హుస్నాబాద్‌రూరల్: అడవిలోని జంతువులు తాగు నీటి కష్టాలను ఆహార కొరతను ఎదుర్కొంటున్నాయి. దాహార్తి తీర్చుకునేందుకు రక్షణ కావడం లాంటి వనం దాటి ఎలుగు బంట్లు, జింకలు, చిరుత పులులు, మనుబోతులు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని ప్రాణాలు విడుస్తున్నాయి. నీటి వనరులున్న దారిలో వేటగాళ్లు ఉచ్చులు బిగించి వాటిని వేటాడుతున్నారు. హుస్నాబాద్ అటవీ రేంజి విస్తీర్ణం 3,994 హెక్టర్లలో ఉంది. వేసవి కాలం వస్తే వీటికి ఆహారం, తాగునీటి కష్టాలు తలెత్తుతాయి.


నీటి సాసర్ల ఏర్పాటు

హుస్నాబాద్ అటవీ రేంజి పరిధిలోకి జనగామ, కరీంనగర్, హన్మకొండ జిల్లా అటవీ సరిహద్దులున్నాయి. జనగామ అటవీశాఖ పరిధిలోని మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి.. సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట మండలాలు వస్తాయి. వీటికి సరిహద్దుల్లోనే కరీంనగర్ జిల్లా సైదాపూర్, అకునూర్ అటవీ ప్రాంతాలు, హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి అటవీ ప్రాంతాలు ఉండటం ఇక్కడ ఎత్తయిన గుంటల ప్రాంతం కావడంతో ఎలుగు బంట్లకు నివాస యోగంగా ఈ అటవీ ప్రాంతం ఉంటుంది. అటవీ జంతువుల దాహార్తి తీర్చడానికి అటవీ శాఖ అధికారులు ప్రత్యేకంగా నీటి సాసర్లను ఏర్పాటు చేశారు. అందులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఉమ్మాపూర్ పరిధిలోని నిర్మించిన మహాసముద్ర గండి కూడా దాహాన్ని తీర్చేందుకు ఉపయోగపడుతుంది. జంతువులను అడవి నుంచి బయటకు రాకుండా చూడటంతో పాటు రైతులకు వాటి నుంచి ఇబ్బందులు లేకుండా శాఖ అధికారులు కట్టడి చేయాలని కోరుతున్నారు.

మృత్యు ఘంటికలు



ఇటీవల దౌల్తాబాద్, చేగుంట అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చులకు చిక్కిన చిరుత పులిని గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారు. నెల రోజుల తర్వాత విషయం బయటకు రావడంతో అటవీ శాఖ అధికారి సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితులను కటకటాల వెనక్కి పంపారు.



మహ్మదాపూర్‌లో గుట్టలో వేటగాళ్లు చంపిన చిరుత పులి (ఫైల్)

ఉమ్మాపూర్ అటవీ ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం అడవి నుంచి చిరుత పులి నీటి కోసం మహ్మదాపూర్ గుట్టల కింద వ్యవసాయ పంట చేళ్ల వద్దకు వస్తుంది. దాని అడుగుల అచ్చులను గమనించిన వేటగాళ్లు అదే దారిలో ఉచ్చులు బిగించి ప్రాణలు తీశారు. పులి గోళ్లకు మార్కెట్‌లో లక్షల డిమాండ్ ఉంటుందని నమ్మిన వేటగాళ్లు దాని ప్రాణం తీసి కాళ్లను నరికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు నిందితుల ఆచూకీని అటవీ శాఖ అధికారులు కనిపెట్టలేదు.

కొన్నేళ్ల క్రితం అడవిలో నీళ్లు, ఆహారం లేకపోవడంతో పచ్చని పంట చేళ్లు కన్పించిన పోతారం(ఎస్) మైదానం ప్రాంతాలకు జింకల గుంపు వచ్చింది. వాటిని కుక్కలు తరమడంతో కొన్ని పరుగెత్తుతూ పోతారం (ఎస్) అటవీ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో పడ్డాయి. ఇంకొన్ని అడవిలోకి పరుగులు పెట్టాయి. వేసవిలో ఎలుగు బంట్లు దాహం కోసం వచ్చి వ్యవసాయ బావుల్లో పడిన సందర్భాలు సైతం అనేకమున్నాయి. ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్న వన్యప్రాణులను రక్షించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఆవాసాల నుంచి జంతువులు బయటకు రాకుండా నీరు, ఆహారం అందిస్తే బయటరావు కదా అని జనం అంటున్నారు.

వన్యప్రాణులను వధిస్తే ఏడేళ్ల జైలు



అడవి జంతువులను వేటాడిన, చంపిన వారికి ఏడేళ్ల జైలు శిక్షపడుతుంది. దౌల్తాబాద్‌లో చిరుతను చంపిన వేటగాళ్లు కటకటాలపాలయ్యారు. వ్యవసాయ బావుల వద్ద వన్యప్రాణులు గాయల బారినపడి కన్పిస్తే మాకు సమాచారమివ్వాలి. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ జంతువులను సంరక్షించటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దాహార్తి తీర్చేందుకు నీటి కొరతను దృష్టిలో పెట్టుకొని నీటి ససార్లను ఏర్పాటు చేస్తున్నాం. సంతానోత్పత్తి కోసం ఎలుగు బంట్లు కలుసుకోనే సమయం అవి దారి తప్పి బయటకు వచ్చినప్పుడు ఎవరు ఎదురు పడ్డ భయంతో దాడి చేస్తాయి. రైతులు వాటి కంట పడకుండ ఉంటే అవి తిరిగి అడవిలోకి వెళ్తాయి. వేటగాళ్లను రాకుండా చూస్తున్నాం.

– సందీప్‌కుమార్, హుస్నాబాద్ అటవీ రేంజి అధికారి

అడవి బయటకు వచ్చే ప్రాణులు

చిరుత, ఎలుగు బంట్లు, జింకలు, మనుబోతులు ఆహారం కోసం రాత్రి సమయంలో అటవీ ప్రాంతంలోని పంట చేళ్లకు వచ్చి ఆకలి తీర్చుకొని మళ్లీ నివాసాలకు చేరుకుంటాయి. ఈ క్రమంలో ఆలస్యమై స్థానికుల కంటపడుతాయి. ఎలుగు బంట్లు, చిరుతలు వాటి తోవన పోనిస్తే దాడి చేయవు. అదే చిరుత విషయమై రోజుకు 20 నుంచి 40 కి.మీ వరకు తిరుగుతుంది. ఇది అడవిలో ఒకే చోట ఉండదు బయటకు వచ్చే అవకాశం ఉంటుంది.